క్లుప్తంగా

కోన వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు



స్వామివారికి పూజలు చేస్తున్న భక్తులు

సి.బెళగల్: మండల పరిధిలోని క్రిష్ణదొడ్డి గ్రామ కొండపై వెలసిన కోనవెంకటేశ్వర స్వామి వారికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భూదేవి, అలివేలి మంగమ్మ సమేత స్వామివారి మూలవిగ్రహాలకు అభిషేకం చేసి, పుష్ప, పత్రాలతో అలంకరించారు. స్థానికులు, పరిసర గ్రామాల భక్తులు ఉదయం నుంచి రాత్రి వరకు పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులకు ప్రసాదంతో పాటు అన్నదాన కార్యక్రమం కూడా నిర్వహించారు.

ఎస్సీ,ఎస్టీ కేసుపై డీఎస్పీ విచారణ



ఇనగండ్లలో సాక్షులను విచారిస్తున్న డీఎస్పీ

సి.బెళగల్: మండల పరిధిలోని ఇనగండ్ల గ్రామంలో జరిగిన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై కర్నూలు డీఎస్పీ బాబు ప్రసాద్ శనివారం విచారణ చేపట్టారు. ఆగస్టు 22న పొలం రహదారి వివాదంపై మణెమ్మ కుటుంబ సభ్యులు, బోయ గోపాల్‌తోపాటు మరికొందరి మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘటనలో తనపై దాడి చేసి, కులం పేరుతో దూషించారని మణెమ్మ ఫిర్యాదు చేయడంతో, సెప్టెంబర్ 6న సి.బెళగల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ క్రమంలో డీఎస్పీ బాబు ప్రసాద్, కోడుమూరు సీఐ తబ్రేజ్, స్థానిక ఎస్ఐ పరమేష్ నాయక్, పోలీస్ సిబ్బందితో కలిసి గ్రామానికి వెళ్లి బాధితులు, నిందితులు, సాక్షుల వాంగ్మూలాలు సేకరించారు.

ప్రథమ చికిత్సపై అవగాహన



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న సెట్కూరు సీఈఓ

కల్లూరు: ప్రపంచ ప్రథమ చికిత్స దినోత్సవం సందర్భంగా శనివారం లక్ష్మీపురం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి మండల ప్రత్యేక అధికారి (సెట్కూరు సీఈఓ) వేణుగోపాల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కేజీబీవీలో విద్యార్థులకు ప్రథమ చికిత్సపై వ్యాస రచన పోటీ నిర్వహించారు. విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం సెప్టెంబర్ రెండవ శనివారం ప్రపంచ వ్యాప్తంగా ప్రథమ చికిత్స దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిక్షణ ప్రాముఖ్యత, అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను ఎలా కాపాడుతుందనే అంశాలను వివరించారు. కార్యక్రమంలో ఉలిందకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఆనంద రావు, ఎంపీహెచ్ఈఓ విజయ్ కుమార్, కేజీబీవీ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ట్యాంక్ శుభ్రం చేయాలంటే సవాలే!



ట్యాంక్ మెట్లకు అమర్చిన గ్రిల్ ఊడిపోయిన దృశ్యం

పాణ్యం: మండల కేంద్రమైన పాణ్యంలోని డొంగు వద్ద ఉన్న ఓహెచ్ఆర్ వాటర్ ట్యాంక్ శుభ్రం చేయాలంటే సిబ్బందికి సవాల్‌గా మాతుంది. ట్యాంక్ ఎక్కాలన్న భయపడాల్సి వస్తోంది. 2019లో రూ.85లక్షలలో 2లక్షల లీటర్ల సామర్థ్యంతో ట్యాంక్‌ను నిర్మించారు. అయితే ట్యాంక్ పైకి ఎక్కేందుకు మెట్లకు సపోర్టుగా గ్రిల్‌ను ఏర్పాటు చేయగా.. అది కాస్తా నాణ్యత లేకపోవడంతో ఊడిపోయింది. దీంతో ట్యాంక్‌ను శుభ్రం చేయాలన్నా సిబ్బంది భయంతో సాహసం చేస్తూ ట్యాంక్ ఎక్కువుతున్నారు. అధికారులు చర్యలు తీసుకొని గ్రిల్‌కు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

హరిహర క్షేత్రంలో నూతన కలెక్టర్ పూజలు

కర్నూలు కల్చరల్: జిల్లా నూతన కలెక్టర్ డాక్టర్ అట్టాడ సిరి శనివారం సంకల్ బాగ్‌లోని హరిహర క్షేత్రాన్ని సందర్శించారు. వెంకటేశ్వర స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. సకల శుభాలు కలగాలని వేదపండితులు ఆశీర్వదించారు. అంతకు ముందు ఆలయ కమిటీ సభ్యులు, అధ్యక్షులు సందేల్ చంద్రశేఖర్, గౌరవాధ్యక్షుడు దుర్గా ప్రసాద్, ప్రధాన కార్యదర్శి నాగరాజ శర్మ, ఉపాధ్యక్షుడు కంచుగంటల శ్యామసుందర్, గౌరవ సలహాదారులు రవిచంద్ర శర్మ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.



ముదుమాల ఆర్అండ్‌బీ రోడ్డుపై ఉన్న గోతులు



సి.బెళగల్-పోలకల్ రోడ్డులో కల్వర్టు వద్ద కుంగిన రోడ్డు



కస్తూర్బా పాఠశాల వద్ద కోతకు గురైన రోడ్డు

నరక‘దారులు’

ఇటీవల కురిసిన వర్షాలతో గ్రామీణ రోడ్ల దుస్థితి బయటపడుతోంది. సి.బెళగల్ మండలంలోని ప్రధాన రహదారులు గుంతలమయంగా మారడంతో ప్రమాదకరంగా మారాయి. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మడుగులను తలపిస్తున్న రోడ్లపై గోతులు, నీటి నిల్వలతో ప్రయాణికులు ప్రమాదాలను ఎదుర్కొంటున్నారు. సి.బెళగల్‌లోని కస్తూర్బా, ఇటుక బట్టీల దగ్గర కల్వర్టులు కుంగిపోవడంతో పాటు, జిల్లా పరిషత్ హైస్కూల్ నుంచి మోడల్ స్కూల్ వరకు మూడు కిలోమీటర్ల రోడ్డుపై భారీ గోతులు ఏర్పడ్డాయి. బస్టాండ్‌లోని పాత వైన్‌షాప్ వద్ద రెండు మీటర్ల లోతైన గోతితో



పాటు, ఎస్సీ కాలనీ, కంబదహాల్ గ్రామ ప్రవేశం దగ్గర పరిస్థితి ప్రమాదకరంగా మారింది. పోలకల్–ముదుమాలకు వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డులోనూ గోతులు ఎక్కువగా ఉండడంతో వాహనదారులు,



కంబదహాల్ ప్రధాన రోడ్డుపై భారీగా చేరిన నీరు

ప్రజలు అవస్థలు పడుతున్నారు. పలుమార్లు ఫిర్యాదులు చేసినా అధికారులు చర్యలు తీసుకోవడంలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రధాన రహదారులకు మరమ్మతులు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు

– సి.బెళగల్

బీమా పథకాన్ని అమలు చేయండి

కల్లూరు: ప్రభుత్వం బీమా పథకాన్ని అమలు చేయాలని ఆటో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, సీఐటీయూ ఆటో యూనియన్ న్యూ సిటీ ప్రధాన కార్యదర్శి జి.రాధాకృష్ణ డిమాండ్ చేశారు. కుటుంబానికి అండగా ఉన్న యజమాని మరణిస్తే ప్రభుత్వాలు బీమా కింద ఆర్థిక సహాయం చేసేవారన్నారు. ఇప్పుడు ప్రస్తుతం ఎలాంటి బీమా పథకాలు వర్తించడం లేదన్నారు. గత 21 సంవత్సరాలుగా ఆటోనడుపుతూ జీవనం సాగిస్తున్న శరీన్‌నగర్‌కు చెందిన ఐటీసీ ఆటో స్టాండ్ సీఐటీయూ కార్యకర్త డి. రంగస్వామి/దుబ్బన్న (46) శనివారం గుండెపోటుతో మరణించారు. విషయం తెలిసి సీఐటీయూ ఆటో యూనియన్ నాయకులు ప్రభాకర్, రాధాకృష్ణ, అధ్యక్షులు హుస్సేన్ వలి, సీపీఎం నాయకులు యేసు, శీను తదితరులు రంగస్వామి భౌతికకాయని సందర్శించి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రభుత్వం ఉచిత బీమాలాంటి సౌకర్యం కల్పించి ఉంటే ఆ కుటుంబానికి అండగా ఉండేదన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సహజ మరణానికి బీమా అందించిందన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం తక్షణమే స్పందించి రంగస్వామి కుటుంబానికి రూ. 5లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు చంద్ర, పొట్టి రాజు, షారు, రాము, నరసింహా తదితరులు పాల్గొన్నారు.

‘అర్బన్’ కాలనీ.. కానరాని అభివృద్ధి



మహాలక్ష్మి నగర్‌లో బురదమయమైన మట్టి రోడ్డు



కల్లూరు: కర్నూలు నగరపాలక సంస్థలో మొత్తం 52 వార్డులు ఉన్నాయి. అందుల్లో 16 వార్డులు కల్లూరు అర్బన్ పరిధిలో ఉన్నాయి. 16 వార్డులలో సుమారుగా 2.5లక్షల మంది జనాభా ఉన్నారు. అర్బన్ ప్రాంతం రోజురోజుకు విస్తరిస్తోంది. మున్సిపాలిటీకి అధిక ఆదాయం 16 వార్డుల నుంచే వస్తుంది. అయితే కల్లూరులోని కాలనీలు అభివృద్ధికి నోచుకోవడం లేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీకర్‌సెక్షన్ కాలనీ, ముజఫర్‌నగర్, పందిపాడు ఇందిరమ్మ కాలనీ, ఎఫ్‌సీఐ కాలనీ, మహాలక్ష్మినగర్, నాగేంద్ర నగర్ తదితర కాలనీల్లో రోడ్లు అభివృద్ధికి నోచుకోవడం లేదని ఆయా కాలనీల ప్రజలు వాపోతున్నారు. మట్టి రోడ్లు గుంతలమయంగా ఉండడంతో వర్షపునీరు నిలుస్తోంది. ఈ రోడ్లపై నడవడానికి కూడా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. రోడ్లు బురుదమయంగా మారడంతో ద్విచక్రవాహన దారులు అదుపు తప్పి ప్రమాదాలకు గురికావాల్సి వస్తుందని ప్రజలు వాపోతున్నారు. రోడ్లను బాగు చేయాలని ఆయా కాలనీల ప్రజలు కోరుతున్నారు.

గట్టుపైన చెట్టు.. కాల్వకు ముప్పు

పాణ్యం: మండల కేంద్రమైన పాణ్యంలోని ఎస్సార్బీసీ ప్రధాన కాల్వ గట్టుపై ఏపుగా పెరిగిన ఓ చెట్టు కాల్వ పటిష్టతకే ప్రమాదకరంగా మారింది. బ్లాక్–3 వద్ద ఓ చెట్టు అంతకంతకు ఏపుగా పెరిగి మానయ్యింది. చెట్టు పెరిగే కొద్ది ప్రధాన కాల్వ లైనింగ్‌ను చీల్చుకుంటూ పోతోంది. ఇది ప్రమాదనికి సంకేతానిస్తోంది. అధికారులు సకాలంలో చర్యలు తీసుకొని కాలువను పటిష్టం చేయాలని రైతులు కోరుతున్నారు.



ఎస్సార్బీసీ కాల్వ గట్టును చీల్చుకుంటూ ఏపుగా పెరిగిన చెట్టు

ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పిచ్చి మొక్కలు

కల్లూరు: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలని సీపీఐ నగర సహాయ కార్యదర్శి డి. శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. శనివారం కల్లూరు అర్బన్ 36వ వార్డు పరిధిలోని రాజీవ్ గృహకల్పలో సీపీఐ నాయకులు పర్యటించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ రాజీవ్ గృహకల్ప కాలనీలో సుమారుగా మూడువేల మంది జీవనం సాగిస్తున్నారన్నారు. 28 బ్లాకులు ఉండగా విద్యుత్ సరఫరా కోరకు 10 నుంచి 14 ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారన్నారు. కొన్ని ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద పిచ్చి మొక్కలు పెరగా, కొన్నింటి వద్ద గుంతలు, ప్రహరీలు లేవన్నారు. అధికారులు స్పందించి సమస్యలను పరిష్కారించాలని కోరారు. కార్యక్రమంలో కాలనీ వాసులు రామాంజనేయులు, ఖలీల్, హుస్సేన్, పీరా విజయ్, మక్బుల్ బాషా, సూరి, షాకిర్ తదితరులు పాల్గొన్నారు.



ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఉన్న పిచ్చి మొక్కలను చూపిస్తున్న సీపీఐ నాయకులు

భాద్రపద మాస పూజలు

బేతంచెర్ల: మండల పరిధిలోని వైష్ణవ పుణ్యక్షేత్రమైన మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో భాద్రపద మాసం సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉమ్మడి కర్నూలు జిల్లాతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వేకువజాము నుంచే ఆలయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు అభిషేకం, ఆకుపూజ, కుంకుమార్చన, మహామంగళహారతి నిర్వహించి, స్వామివారి ఇష్టమైన వరపూజ చేసి మొక్కులు చెల్లించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉప కమిషనర్, ఈఓ రామాంజనేయులు ప్రత్యేక చర్యలు చేపట్టారు.



మద్దిలేటిస్వామి ఆలయ ఆవరణలో భక్తుల సందడి

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

కర్నూలు(రూరల్): మండలంలోని పుడూరు గ్రామ సమీపాన తుంగభద్ర నది ఒడ్డున శనివారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. వివరాలు.. కాటమరాయుని ఆలయం వద్ద నీటిలో ఒక వ్యక్తి మృతదేహం తేలుతూ కనిపించడంతో గ్రామస్తులు అర్బన్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. సుమారు 55 ఏళ్ల వయస్సు గల ఆ వ్యక్తి ఫుల్ షర్ట్, ఫుల్ బనియన్, నీలం రంగు డ్రాయర్ ధరించి ఉన్నట్లు గుర్తించారు. గ్రామ రెవెన్యూ అధికారి శరభరాజ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, శవాన్ని పోస్టుమార్టం కోసం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తరలించారు. వ్యక్తి పొరపాటున నదిలో పడి మృతి చెందాడా? లేక హత్య చేసి నీటిలో పడేశారా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

భక్తులపై తేనెటీగల దాడి

బేతంచెర్ల: మండల పరిధిలోని మద్దిలేటి నరసింహ స్వామి ఆలయం సమీపంలో శనివారం 15 మంది భక్తులపై తేనెటీగలు దాడి చేశాయి. వివరాలు..ం ఎమ్మిగనూరుకు చెందిన ఒకే కుటుంబ భక్తులు ఆలయానికి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వద్ద వెంగమ్మ కొట్టాల వద్ద దాసంగం పెట్టేందుకు వంట చేస్తున్నారు. ఈ క్రమంలో తేనెటీగలు మాధవి, సంగీత, సరస్వతి, లత, అంపయ్య, లక్కిలపై దాడి చేశాయి. అదే సమయంలో పక్కన వెళ్తున్న ఆర్ఎస్ రంగాపురానికి చెందిన మరో 10 మంది భక్తులపై కూడా దాడి చేశాయి. గాయపడిన వారిని బేతంచెర్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

ప్లీజ్.. ఉల్లి కొనండి !

కర్నూలు(అగ్రికల్చర్): మార్క్‌ఫెడ్ రైతుల నుంచి కొన్న ఉల్లిగడ్డలను వదిలించుకునేందుకు నానా తంటాలు పడుతోంది. ఇప్పటి వరకు కొనుగోలు చేసిన ఉల్లి మార్కెట్ యార్డులో, గోదాముల్లో పేరుకుపోయింది. దీనిని ఎలాగైనా విక్రయించాలని శనివారం వేలంపాట నిర్వహించింది. ఈ పాటలో పాల్గొనేందుకు వ్యాపారులు, హోటల్, విద్యాసంస్థల యాజమాన్యాలు ఆసక్తి చూపలేదు. కొది మంది మాత్రమే వేలం పాటలో పాల్గొనగా క్వింటాలు కనిష్ఠంగా రూ.50, గరిష్టంగా రూ.440 పలికింది. వారం రోజుల కిత్రం కొనుగోలు చేసిన ఉల్లిగడ్డలు కూడా మార్కెట్ యార్డుల్లోని వివిధ షెడ్‌లు, గోదాముల్లో నిల్వ ఉంది. ఒకవైపు వర్షాలు కురుస్తుండటం, మరోవైపు నిల్వ చేసిన ఉల్లికి గాలి కూడా తగలకపోవడంతో కుళ్లి పోతున్నాయి. మార్కెట్ యార్డులో మార్క్‌ఫెడ్ కొనుగోలు చేసిన ఉల్లి 3000 టన్నులు ఉండగా... అతి కష్టం మీద బతిమలాడి 1500 టన్నుల వరకు నామమాత్రపు ధరలతో కొనిపించారు. వ్యాపారులు వద్దు వద్దని అంటున్నా బలవంతంగా క్వింటాలు ఉల్లి రూ.50, రూ.100 ప్రకారం అంటగట్టారు. మిగిలిన ఉల్లిని ఆదివారం వేలంపాట ద్వారా విక్రయిస్తారు. ఇది వరకు కొనుగోలు చేసిన ఉల్లిగడ్డలను మార్క్‌ఫెడ్ తాడేపల్లిగూడెం మార్కెట్‌కు, హైదరాబాద్‌లోని మలకోపేట మార్కెట్‌కు తరలించేది. అక్కడ నాణ్యత లేదని తిరస్కరిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో కొనుగోలు చేసిన ఉల్లి గడ్డలను ఏమి చేయాలనే దానిపై ప్లానింగ్ లేకపోవడంతో ఉన్న సరుకు కుల్లి పోతోంది. కాగా మార్క్‌ఫెడ్ కొనుగోలు చేసిన ఉల్లి గడ్డల నాణ్యతను జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి, జాయింట్ కలెక్టర్ నవ్య పరిశీలించారు. ఇప్పటి వరకు ఎన్ని క్వింటాళ్లు కొన్నారు..ఎన్ని క్వింటాలు బయటికి తరలించారు. మార్కెట్ యార్డులో ఎంత ఉందనే వివరాలను ఆరా తీశారు.

నదీతీర ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కోడుమూరు రూరల్: కోడుమూరు హంద్రీనదికి గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేస్తున్న క్రమంలో నదీతీర గ్రామాల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ ఎర్రిస్వామి సూచించారు. నదీతీర గ్రామాలైన వర్కూరు, కోడుమూరు, ముడుమలగుర్తి, గోరంట్ల, లద్దగిరి, అనుగొండ గ్రామాల్లో శనివారం ఎస్ఐ ఎర్రిస్వామి, ట్రైనీ ఎస్ఐ మణికంఠ తమ సిబ్బందితో కలిసి పర్యటించారు. ఆయా గ్రామాల్లో దండోరా వేయించి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. హంద్రీలో భారీగా వరదనీరు ప్రవహిస్తున్నందున ఎట్టి పరిస్థితుల్లోనూ నది వద్దకు వెళ్లరాదని స్పష్టం చేశారు.

నీటి సరఫరాలో అంతరాయం

హంద్రీనదిలో వరదనీరు పోటెత్తడంతో నది నుంచి కోడుమూరు కాలనీలకు మంచినీటిని సరఫరా చేసే మోటార్లను ఒడ్డుకు తరలించినట్లు మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ భాగ్యరత్న తెలిపారు. హంద్రీ నుంచి మోటార్లను తరలించడం వల్ల పట్టణంలో ఒకటి రెండు రోజులు మంచినీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని, ప్రజలు సహకరించాలని కోరారు.



కోడుమూరులో దండోరా వేయిస్తున్న పోలీసులు



కోడుమూరు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న హంద్రీనది

పోటెత్తిన హంద్రీనది

గాజులదిన్నె ప్రాజెక్టు గేట్లను ఎత్తి అధికారులు దిగువకు నీటి విడుదల చేయడంతో కోడుమూరు వద్ద హంద్రీనది పోటెత్తి ప్రవహిస్తోంది. భారీ వర్షాలకు గాజులదిన్నె ప్రాజెక్టుకు భారీగా ఇన్‌ఫ్లో ఉండడంతో శుక్రవారం రాత్రి మొదట రెండు వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తర్వాత ఐదు వేల క్యూసెక్కులకు పెంచారు. దీంతో కోడుమూరు వద్ద హంద్రీనది ఉధృతంగా ప్రవహిస్తోంది.

– కోడుమూరు రూరల్

మరుగుదొడ్లు లేక అవస్థలు

- ప్రభుత్వ కార్యాలయాల వద్ద మరుగుదొడ్లు లేక ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు



కర్నూలు రూరల్ తహసీల్దార్ కార్యాలయం వద్ద అధికారుల కోసం వేచిచూస్తున్న మహిళలు

కర్నూలు(రూరల్): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి స్వచ్ఛ భారత్, స్వచ్ఛాంధ్ర అంటూ ప్రచారం చేస్తూ అవగాహన ర్యాలీలు నిర్వహిస్తున్నాం ప్రభుత్వ కార్యాలయాల్లో మాత్రం మరుగుదొడ్లు లేని పరిస్థితి. కర్నూలు రూరల్ తహసీల్దార్ కార్యాలయం, రెవెన్యూ డివిజన్, మహిళా పోలీస్ స్టేషన్, మహిళా సబ్‌జైలు, మహిళా నృత్యకళాశాల ఇలా అన్నీ ఒకే ప్రాంగణంలో ఉండడంతో రోజూ వందలాది మంది వివిధ గ్రామాల నుంచి సమస్యల పరిష్కారం కోసం ఇక్కడికి వస్తున్నారు. కానీ మరుగుదొడ్లు లేకపోవడంతో ముఖ్యంగా మహిళలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పరిశుభ్రతపై ప్రచారం చేసే ప్రభుత్వ కార్యాలయాల్లోనే మరుగుదొడ్లు నిర్మించకపోవడం శోచనీయమని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉగ్గ పట్టుకోవాల్సిందే

వివిధ పనులపై ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చిన సమయంలో ఆరుబయటకు వెళ్లాల్సి వస్తే చాలా ఇబ్బంది పడాల్సిన పరిస్థితి. మళ్లీ ఇంటికి వెళ్లే వరకు ఉగ్గ పటుకోవాల్సి వస్తోందని మహిళలు వాపోతున్నారు. కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో సిబ్బంది సైతం అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి సామాజిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

మరుగుదొడ్లు నిర్మించాలి



పరిశుభ్రత గురించి ప్రచారం నిర్వహించే అధికారులు వాటిని అమలు చేయడంతో విఫలమవుతున్నారు. సామాజిక మరుగుదొడ్లు లేకపోవడంతో ప్రజలు, కార్యాలయయానికి వచ్చే సిబ్బంది పడే ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కార్యాలయాల్లో ప్రజల కోసం మరుగుదొడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి.

–పీబీ హుసేనయ్య, సీపీఎం మండల కార్యదర్శి

ప్రభుత్వ నర్సుల పదోన్నతులకు కృషి



కార్యక్రమంలో మాట్లాడుతున్న అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు ఎస్.రాధమ్మ

కర్నూలు(హాస్పిటల్): రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేసే నర్సులకు పదోన్నతులు కల్పించేందుకు కృషి చేస్తామని ఏపీ ప్రభుత్వ నర్సుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు ఎస్.రాధమ్మ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. కోటమ్మ చెప్పారు. శనివారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఓల్డ్ క్లినికల్ లెక్చరర్ గ్యాలరీలో ఏపీ గవర్నమెంట్ నర్సెస్ అసోసియేషన్ కర్నూలు జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షురాలు లీలావతి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ కాంట్రాక్టు స్టాఫ్ నర్సులను రెగ్యులరైజ్ చేసేందుకు, వారికి వంద శాతం గ్రాస్ శాలరీ కోసం ఉన్నతాధికారులకు విన్నవించి సాధించేందుకు ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం సమావేశంలో డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్, జోన్–4 పరిధిల్లో ఖాళీగా ఉన్న హెడ్ నర్సు, నర్సింగ్ సూపరింటెండెంట్ పోస్టులను భర్తీ చేయాలని, డీఎంఈ పరిధిలో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ ప్రొఫెసర్, లెక్చరర్ పోస్టులను భర్తీ చేయాలని, కాంట్రాక్టు స్టాఫ్ నర్సులను రెగ్యులర్ చేయాలని, రెగ్యులర్ నర్సింగ్ సిబ్బందికి 8 సంవత్సరాలకు ఒకసారి బదిలీలు జరగాలని, కాంట్రాక్టు స్టాఫ్‌నర్సులకు కూడా బదిలీలు నిర్వహించాలని, వీటితో పాటు మరో 42 అంశాలను ప్రభుత్వాన్ని కోరేందుకు తీర్మానించారు. సమావేశంలో స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ నర్సింగ్ సూపరింటెండెంట్ అనసూయ, ఏపీ ఎన్జీవోస్ నాయకులు కాశన్న, శ్రీనివాస యాదవ్, ప్రభాకర్‌రెడ్డి, నర్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జి.శాంతిభవాని, జిల్లా ప్రధాన కార్యదర్శి సి.బంగారి, ట్రెజరర్ ఎస్.లక్ష్మీనరసమ్మ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



గురువులతో పూర్వ విద్యార్థులు

కల్లూరు: కల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు శనివారం వేడుకగా కలుసుకున్నారు. 20 ఏళ్ల తరువాత కలుసుకున్నా వారు ఒకరినొకరు పలకరిచుకొని చిన్ననాటి మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. వారికి విద్యాబుద్ధులు నేర్పిన గురువులు రత్నం, యేసుపు, వాసుదేవయ్య, సాయిలీల, బాబయ్య, పద్మజ తదితరులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అలనాటి ఉపాధ్యాయులు మాట్లాడుతూ 20 సంవత్సరాల తర్వాత తమ పిల్లలను చూసినట్లుందని ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రస్తుత ప్రధానోపాధ్యాయులు హుస్సేన్, పూర్వ విద్యార్థులు దామోదర్, మా బాషా, రమేష్, అంజి, నరసన్న, సుధాకర్, పరశురామ్, వాణి, శైలజ, ప్రసన్న, రేవతి తదితరులు పాల్గొన్నారు.